## దుర్గమ్మను దర్శించుకున్న దేవినేని ఉమా

విజయవాడ దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని శ్రీ దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు తెదేపా నేత మాజీ మంత్రి దేవినేని ఉమా కాలినడకన వెళ్లారు. వన్ టౌన్ వినాయకుడి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సాధారణ క్యూ లైన్ లో భక్తులతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా శరన్నవరాత్రుల సందర్భంగా మొదటి రోజు అమ్మవారిని కాలినడకన వెళ్లి దర్శించుకుంటున్నారు. గురువారం బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో కనకదుర్గమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 04-10-2024 సంపుటి : 06 సంచిక : 09 పేజీలు : 8 వెల : రూ 3-00


## తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ రేపటికి వాయిదా



ఢిల్లీ : తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించారనే ఆరోపణలపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ ప్రారంభమయ్యింది. ధర్మాసనం మరో కేసులో బిజీగా ఉండడం వల్ల సొలిసిటర్ జనరల్ విజ్ఞప్తి మేరకు కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. భక్తుల మనోభావాలను, తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు చేశారంటూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి, టీటీడీ మాజీ చైర్మన్ , వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో పాటు మరో ఇద్దరు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ధర్మాసనానికి మరో ముఖ్య కేసు ఉన్నందున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుంది. రేపు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విచారణ చేపడుతామని న్యాయమూర్తులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు దర్యాప్తునకు ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం కొనసాగించాలా ? లేంటే స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలా అని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది.

## మిజోరం గవర్నర్‌ను కలిసిన అక్కినేని నాగార్జున

అమరావతి : ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున మిజోరం గవర్నర్ ను కలిశారు. గురువారం హైదరాబాద్ నుంచి బయలుదేరి విశాఖపట్నంలోని



గవర్నర్ కంభంపాటి హరిబాబు నివాసానికి వెళ్లారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న హరిబాబును యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులున్నారు.

## వైభవంగా ఇంద్రకీలాద్రి, శ్రీశైలం ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

అమరావతి : శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఏపీలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఇంద్రకీలాద్రి , శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా ఇంద్రకీలాద్రిలో తొలిరోజున దుర్గామాత బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల మొదటిరోజునే భక్తులు ఆలయాలకు వచ్చి భవానీ దీక్షలను ప్రారంభించారు. ఏపీ మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి పార్థసారధి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి మాట్లాడుతూ సామాన్య భక్తులు సులువుగా దర్శనం చేసుకునేందుకు వీలుగా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సుమారు 5 వేల మంది పోలీసులతో బందోబస్తు, 200 సీసీ కెమెరాల ఏర్పాటు, వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సమయం కేటాయింపు తదితర చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నంద్యాల జిల్లాలోని శక్తిపీఠము జ్యోతిర్లింగం కొలువైన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో దసరా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించే దసరా ఉత్సవాలకు ఆలయ ఈవో పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి దసరా మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. గణపతిపూజ, శివసంకల్పం, చండీశ్వరపూజ, కంకణాధారణ అఖండ దీపారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, వివిధ విశేష పూజలు నిర్వహించారు. ప్రతిరోజు సాయంత్రం వివిధ అలంకరణ రూపంలో శ్రీభ్రమరాంబికా అమ్మవారు భక్తులకు దర్శనం



ఇవ్వనున్నారని ఈవో పెద్దిరాజు తెలిపారు. వివిధ వాహనసేవలతో గ్రామోత్సవంగా శ్రీ స్వామి అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్వరగతిన దర్శనం పూర్తి చేసుకునే విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు.

## తీవ్ర జ్వరంతో తిరుమలలోనే ఉండిపోయిన పవన్ కల్యాణ్..

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. మంగళవారం సాయంత్రం అలిపిరి నుంచి తిరుమలకు పవన్ కల్యాణ్ కాలినడనక చేరుకున్నారు. అయితే మార్గమధ్యలోనే ఆయనకు వెన్ను నొప్పి రావడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అయినప్పటికీ శ్రీవారిని మనసులోనే తలచు కుంటూ పట్టుదలతో ఏడుకొం డలు ఎక్కారు. బుధవారం ఉదయం వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని తన ప్రాయశ్చిత్త దీక్షను విరమించారు. అయితే.. కొండ ఎక్కే సమయంలో వచ్చిన వెన్ను నొప్పితో పవన్ కల్యాణ్ తాజాగా అస్వస్థతకు గురయ్యా రు. ఆయన తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. తిరుమలలో బస చేసిన



అతిథి గృహంలోనే ప్రస్తుతం పవన్ కల్యాణ్ విశ్రాంతి తీసుకుంటున్నారు. అక్కడే ఆయనకు డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన పవన్ కల్యాణ్.. భాగంగా ఇవాళ సాయంత్రం తిరుపతిలో వారాహి డిక్లరేషన్ సభ నిర్వహించాల్సి ఉంది. ఈ సభలో పవన్ కల్యాణ్ ఎలాంటి నిర్ణయాలు ప్రకటిస్తారు? సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఆయన ఎలాంటి పోరాటానికి సిద్ధమవుతారో తెలుసుకోవాలని ఏపీ ప్రజలు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో వారాహి డిక్లరేషన్ సభ ఉంటుందా? లేదా అనే సందిగ్ధత మొదలైంది. అయితే ఎంతటి జ్వరం ఉన్నా సరే పవన్ కల్యాణ్ వారాహి సభకు హాజరవుతారని జనసేన పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మూడురోజులు వర్షాలు..

రాష్ట్రంలో మరో మూడురోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దాంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలుపడే



అవకాశం ఉందని చెప్పింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలుపడే ఛాన్స్ ఉందని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలలో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. శనివారం నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల వానలు కురుస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఇవాళ నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిశాయి. నాగర్ కర్నూల్ జిల్లా వెల్టూరులో అత్యధికంగా 7.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## ఉపాధి హామీ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి


### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 03–మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ఎంపీడీవోలు, ఏపీఓలు, క్షేత్రస్థాయి సిబ్బంది ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఉపాధి హామీ పథకం కింద నిర్ధేశించిన లేబర్ బడ్జెట్, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, సంస్థాగత ప్లాంటేషన్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఫారం పాండ్స్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, పశు సంపద షెడ్లు, ట్రెంచ్ పనుల ప్రగతి లక్ష్యాలపై డ్వామా పిడి జనార్ధన్ రావు కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు.

## మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే.. జగన్ కీలక వ్యాఖ్యలు

రాష్ట్రంలో అధికార దుర్వినియోగం అవుతుందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. రాజకీయాల్లో వ్యక్తిత్వం, విశ్వసనీయత చాలా ముఖ్యమని తెలిపారు. కష్టం వచ్చినప్పుడు అండగా నిలబడగాలని వ్యాఖ్యానించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జడ్పీటీసీ, ఇతర నాయకులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యకర్తలకు వైఎస్ జగన్ భరోసా కల్పించారు. గత ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చామని వైఎస్ జగన్ తెలిపారు. ప్రతి ఏడాది సంక్షేమ క్యాలెండర్ విడుదల చేశామని.. ఏ పథకానికి ఎంత బడ్జెట్ కేటాయించామో స్పష్టంగా చెప్పామని గుర్తుచేశారు. క్యాలెండర్ ప్రకారం వాటిని విడుదల చేసి అండగా ఉండేవాళ్లమని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి



కనిపించడం లేదని విమర్శించారు. వైసీపీ పాలనకు, టీడీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించారని పేర్కొన్నారు. రెండు ప్రభుత్వాల్లో ఎవరికి ఎంత మంచి జరిగిందనే దానిపై ప్రతి కుటుంబంలోనూ చర్చ జరుగుతుందని చెప్పారు. చంద్రబాబు అబద్ధాలు ఇప్పుడు మోసాలుగా మారాయని విమర్శించారు. చంద్రబాబు మోసాలపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతుందని అన్నారు. నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఓపికతో ముందుకు సాగాలని.. ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. ప్రజల తరఫున పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వైసీపీ కార్యకర్తలు కేసులకు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. గొంతులు నొక్కడానికి, అణచివేయాలన్న ధోరణితో కేసులు పెడుతున్నారని.. వీటికి భయపడాల్సిన అవసరం లేదని వైసీపీ కార్యకర్తలకు జగన్ సూచించారు. తనను 16 నెలలు జైలులో పెట్టారని.. తనను హింసించినట్లుగా ఎవ్వరినీ కూడా హింసించి ఉండరని అన్నారు. అయినా ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగామని చెప్పారు.

## ఈశా ఫౌండేషన్ కు వ్యతిరేకంగా హైకోర్టు విచారణపై స్టే!



న్యూఢిల్లీ: సద్గురు జగ్గి వాసుదేవ్ కు చెందిన ఈశా ఫౌండేషన్ కు వ్యతిరేకంగా నమోదైన అన్ని క్రిమినల్ కేసుల రిపోర్టులను అందించాలని తమిళనాడు పోలీసులను మద్రాస్ హైకోర్టు ఆదేశించిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు గురువారం స్టే ఇచ్చింది. విచారణ త్వరగా జరపాలని ఫౌండేషన్ సుప్రీంకోర్టును కోరింది. దానికి కేంద్రం కూడా అనుకూలంగా వ్యవహరించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా "హైకోర్టు చాలా జాగ్రత్తగా ఉండాలి" అన్నారు. ఇద్దరు యువతులను ఫౌండేషన్ బలవంతంగా నిర్బంధించిందని ఆరోపిస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్ ను కూడా భారత ప్రధాన న్యాయమూర్తి డివై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తనకే బదిలీ చేసుకుంది. ఆ ధర్మాసనంలో న్యాయమూర్తులు జెబి. పార్దివాలా, మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆ ఇద్దరు మహిళలను ధర్మాసనం విచారించాకే తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఇద్దరు మహిళల్లో ఒకరు "తమ తండ్రి గత 8 ఏళ్లుగా తమని వేధిస్తున్నాడు" అని తెలిపింది. "ఈ అంశాలు ఆధ్యాత్మిక స్వేచ్ఛకు సంబంధించినవి. ఇది చాలా అర్జెంట్, సీరియస్ కేసు. ఇది ఈశా ఫౌండేషన్ కు సంబంధించిన కేసు. సద్గురుకు లక్షలాది అనుయాయులు ఉన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 04-10-2024

## ప్రపంచాన్ని కుదిపేస్తున్న యుద్ధాలు

గెలుపు, ఓటమిలను పక్కన పెడితే.. యుద్ధం అనేది ఏ దేశానికి మంచిది కాదు. ఆర్థికంగా, సామాజికంగా యుద్ధం ఇరు దేశాలకు చేటే చేస్తుంది. ఎంత సైనిక బలం ఉన్న దేశమైనా ఎంతో కొంత నష్టపోవడం తప్పదు. ఇప్పటి వరకు ఓటమి ఎరుగని రష్యా సైతం ఉక్రెయిన్ పై ప్రకటించిన యుద్ధంతో కేవలం రెండు, మూడు రోజుల్లో ఉక్రెయిన్ రష్యా వశం అవుతుందని ప్రపంచం మొత్తం అనుకుంది. కానీ నెలలు గడుస్తున్నా రష్యా మాత్రం ఉక్రెయిన్ ను ఆక్రమించుకోలేకపోతుంది. ఇక ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నిరంతర పోరాటం కోట్లాది మంది ప్రజలు, ఆస్తుల నాశనానికే తప్ప ఒరిగిందేమీ లేదు. ఇప్పటి వరకు ఏఏ దేశాలు యుద్ధం చేసుకుంటున్నాయి. ఏఏ దేశాలు యుద్ధం చేసుకునే అవకావం ఉందనే విషయం ఇక్కడ తెలుసుకుందాం.

ఇజ్రాయెల్-ఇరాన్..

ఇజ్రాయెల్ పై ఇరాన్ అక్టోబర్ 1న అష్మెలోన్ నుంచి 200 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ క్షిపణి నిరోధక వ్యవస్థ వాటిని అడ్డుకుంది. హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రుల్లా, ఇతర మద్దతు దారుల హత్యపై ఇరాన్ ఆకస్మిక ప్రతిస్పందన ఇది. నిర్ణయాత్మకంగా స్పందించేందుకు సరైన సమయం ఎంచుకుంటామని ఇజ్రాయెల్ సైనికాధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఇజ్రాయెల్ రక్షణకు సహకరించాలని, ఇరాన్ క్షిపణులను కూల్చివేయాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సైన్యాన్ని ఆదేశించినట్లు వైట్ హౌజ్ తెలిపింది. బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ వైట్ హౌజ్ నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ దాడులను పర్యవేక్షిస్తున్నారు. భద్రతకు కట్టుబడి ఉన్నామని బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ ఇజ్రాయెల్ కు హామీ ఇచ్చారు. క్షిపణి మార్పిడి దృష్ట్యా, ఇరాన్-ఇజ్రాయెల్ సంప్రదాయ యుద్ధంగా వర్గీకరించబడనప్పటికీ అలా జరగడం లేదు. ఇరాన్, ఇజ్రాయెల్, పాలస్తీనా, ఉక్రెయిన్, రష్యా మాత్రమే యుద్ధంలో లేవు. ప్రస్తుతం ఎన్ని దేశాలు ఇతర దేశాలతో యుద్ధం చేస్తున్నాయెా లేదా ప్రత్యక్ష సైనిక సంఘర్షణలలో పాల్గొంటున్నాయో తెలుసుకోండి.

ఇజ్రాయెల్ వర్సెస్ పాలస్తీనా (గాజా వివాదం)

గాజాలో ఇజ్రాయెల్, పాలస్తీనా మిలిటెంట్ గ్రూపుల మధ్య హింసాత్మక ఘటనలకు దారితీశాయి. ప్రాదేశిక వివాదాలు, జెరూసలేం స్థితి, ఇజ్రాయెల్ ఆక్రమణ, దిగ్బంధాలకు పాలస్తీనా ప్రతిఘటన, ప్రతిస్పందనగా గాజా నుంచి హమాస్ రాకెట్ దాడులు, ఇజ్రాయెల్ వైమానిక దాడులు వంటి కాలానుగుణ పెరుగుదలతో సంఘర్షణ మొదలైంది. 2024, అక్టోబర్ 1న ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్లోని తుబాస్ వద్ద ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన తర్వాత పాలస్తీనియన్లు ఒక క్షిపణిపై దర్యాప్తు చేస్తున్నారు.

ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్..

హిజ్బుల్లా అధినేత హసన్ నస్రుల్లా హత్యకు ప్రతీకారంగా ఇరాన్ 2024, అక్టోబర్ 1న ఇజ్రాయెల్ పై 200 క్షిపణులను ప్రయోగించింది. ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతోంది. ఇరాన్ నుంచి ప్రయోగించిన క్షిపణి సెంట్రల్ ఇజ్రాయెల్ లోని ఓ పాఠశాల భవనాన్ని ఢీకొట్టిన ప్రదేశాన్ని ఇజ్రాయెల్ రెస్క్యూ ఫోర్స్ సభ్యులు పరిశీలించారు.

రష్యా వర్సెస్ ఉక్రెయిన్

ఉక్రెయిన్ ను పూర్తిగా ఆక్రమించుకునేందుకు రష్యా 2022లో యుద్ధం ప్రకటించింది. తూర్పు ఉక్రెయిన్ లో యుద్ధాలు కొనసాగుతున్నాయి. 2022లో ఉక్రెయిన్ పై రష్యా ఆక్రమణ ఉక్రేనియన్ భూ భాగంపై నియంత్రణను సాధించేందుకు, ఉక్రెయిన్ నాటో, పశ్చిమ దేశాలతో సంబంధాలను కట్ చేయడమే ఈ యుద్ధంకు కారణం. ఉక్రెయిన్ లోని జపోరిజ్జియాలో సెప్టెంబర్ 26, 2024 న రష్యా వైమానిక దాడిలో భారీగా దెబ్బతిన్న నివాస ప్రాంతంలో శిథిలాలను రెస్క్యూ సిబ్బంది తొలగించారు.

సౌదీ వర్సెస్ యెమెన్ (హౌతీ తిరుగుబాటుదారులు):

ఇతర గల్ఫ్ దేశాల మద్దతుతో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణం యెమెన్ లోని హౌతీ తిరుగుబాటుదారులపై సైనిక చర్యను కొనసాగిస్తోంది. యెమెన్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వాన్ని పునరుద్ధరించేందుకు, ఉత్తర యెమెన్ లో ఎక్కువ భాగాన్ని నియంత్రించే ఇరాన్ మద్దతు గల హౌతీ తిరుగుబాటుదారుల ప్రభావాన్ని అరికట్టేందుకు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణం పోరాడుతోంది. 2024, సెప్టెంబరు 30 న యెమెన్ లోని హ్వాడైదాలోని ఎర్ర సముద్రం రేవు హ్వాడైదాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ధ్వంసమైన ఒక పవర్ స్టేషన్ శిథిలాలు.

టర్కీ వర్సెస్ కుర్దిష్ గ్రూప్స్ (పీకేకే)కుర్దిస్థాన్ వర్కర్స్ పార్టీ (పీకేకే), సంబంధిత సమూహాలకు వ్యతిరేకంగా టర్కీ సైనిక చర్యలను కొనసాగిస్తోంది, సిరియా, ఇరాక్ లో సీమాంతర చర్యలతో. టర్కీలోని కుర్దిష్ ప్రాంతాలకు స్వయంప్రతిపత్తి లేదా స్వాతంత్ర్యం కోరుకునే పీకేకే వంటి కుర్దిష్ తిరుగుబాటు సమూహాలను టర్కీ ఎదుర్కొంటోంది. ఇవి తరచుగా సిరియా, ఇరాక్ లోకి ప్రవేశిస్తున్నాయి. సిరియాలోని కుర్దిష్ ఆధీనంలోని ఈశాన్య నగరమైన ఖమిష్లీ నుంచి పొగలు వెలువడుతున్నాయి.

## వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి....




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-అక్టోబర్ 3 వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. వృత్తి విద్య నభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్మెంట్ ఆద్వర్యంలో ఇంటర్న్ షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పాఠశాల యందు చదువుకున్న విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులైన ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి రంగాలలో ప్రత్యక్ష శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వృత్తి విద్య శిక్షకులు మహేష్, అల్లిపీరా పర్యవేక్షణలో ఫోటాన్ ఇన్స్టిట్యూట్, సాయి ఇన్స్టిట్యూట్, తదితర సంస్థలలో ప్రత్యక్ష శిక్షణ అందించడం జరుగుతుంది. విద్యార్థులు పాఠ్యపుస్తకాలలో నేర్చుకున్న జ్ఞానానికి, ప్రత్యక్ష శిక్షణ ద్వారా నేర్చుకున్న విషయాలను బాగా అవగాహన చేసుకొని నిజ జీవిత పరిస్థితుల లో వాటి వినియోగంలో మరిన్ని మెలకువలు తెలుసుకుని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటారని తెలిపారు. విద్యార్థులను బ్యాచ్ లుగా చేసి వివిధ కేంద్రాలలో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు.

## గిరిజన కాలనీని ఐటీడీఏలో చేర్పించండి: సిపిఐ నాయకుల డిమాండ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 03-మహానంది మండలం అబ్బిపురం గిరిజన కాలనీని ఐటీడీఏ లో చేర్చి. ఇంటి నిర్మాణాలు. రోడ్డు నిర్మాణము. వీధి కాలువలు. మరుగుదొడ్డు లాంటి మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మహానంది మండల సీపీఐ సమితి ఆధ్వర్యంలో మహానందికి విచ్చేసిన శ్రీశైలం నియోజవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారికి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం అందజేశారు . ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్. సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి. తుపాకుల వెంకటేశ్వర్లు. రైతు సంఘం నాయకులు. గురుమూర్తి. శాఖ కార్యదర్శి లక్ష్మయ్య. మహిళా నాయకురాలు లక్ష్మీదేవి. తదితరులు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రుల్లో మొదటిరోజు అమ్మవారికి విశేష పూజలు...






విభారె న్యూస్ అక్టోబర్ 03 ఎమ్మిగనూరు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటిరోజు గురువారం ఆలయంలోని శ్రీ నగేశ్వర స్వామి, అమ్మవారికి ఉదయం అభిషేకం, అర్చన, అలంకారం తదితర పూజలను నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలచే లలిత సహస్రనామార్చన, కుంకుమార్చన వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. పై పూజా కార్యక్రమాలన్నీ ఆలయ ప్రధాన అర్చకులు రాతన గురు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఉదయం 8.30 ని.లకు ఇల్లూరు లక్ష్మయ్య శెట్టి స్వహస్థాలతో ఆర్యవైశ్య పతాకావిష్కరణ, ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు గావించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులందరూ పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన వారికి ఆర్థిక సాయం...



విభారే న్యూస్ డోన్ మామ్ ప్రతినిధి:-అక్టోబర్ 3 వెల్దుర్తి మండలం మదార్ పురం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాయి బ్రాహ్మణ మోక్షిత్ శస్త్ర చికిత్స తప్పనిసరి అని వైద్యులు తెలపడం వలన డోన్ నాయి బ్రాహ్మణ కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన 56,000 రూపాయలు నగదును సోమశేఖర్, మద్దయ్య, తిరుపాల్, గోపాల్, సోమన్న ల గురువారం అందజేశారు.

## వరి సాగులో పొలం బడి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 03- నంద్యాల మండలం అయ్యలూరు మరియు పెద్ద కొట్టాల గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాద రావు ఆధ్వర్యములో పొలంపిలుస్తోంది కార్యక్రమము ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు, నంద్యాల డి.రాజశేఖర్. ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఎడిఏ డి.రాజశేఖర్ మాట్లాడుతూ అయ్యలూరు గ్రామములో ముఖ్యమైన పంట వరి అని వరి లో సమగ్ర పోషకాల యాజమాన్యం గురించి సవివరంగా వివరించినట్లు తెలిపారు. రైతులు పోటాష్ ఎరువులు తప్పకుండా 20 కేజీలు వాడడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తద్వారా తెగుళ్లు మరియు పురుగుల ఉధృతి తగ్గుతుందని దీని ద్వారా రైతులకు పురుగు మందులు వాడకంలో అయ్యే ఖర్చు కొంచం తగ్గించుకోవచ్చని సూచించారు పెద్ద కొట్టాల గ్రామములో మండల వ్యవసాయ అధికారి, నంద్యాల ఇ. ప్రసాద రావు మాట్లాడుతూ రైతులు 3 సంవత్సరాలకు ఒకసారి మట్టి పరీక్షలు చేయించుకొని మట్టి పరీక్ష ఆధారిత ఎరువులు వాడుకోవాలని సూచించారు . తదుపరి వరి మరియు మొక్కజొన్న పంట పొలాలను సందర్శించి మొక్కజొన్న పంటలో ఎండు తెగులు ఉధృతి గమనించారు. . ఈ ఎండు తెగులు సోకడము వలన మొక్క వేరు నల్లగా మారి మొక్కలు చనిపోవడం జరుగుతుందన్నారు. దీనికి నివారణగా ట్రైకోడెర్మ విరిడీ అనే మందును 100 కేజీ ల పశువుల ఎరువుకి 2 కేజీ ల ట్రైకో డెర్మ విరిడీ ని కలిపి బెల్లం నీళ్లు చిలకరిస్తూ ఒక వారం రోజులు మగ్గబెట్టి తరువాత పొలములో చల్లుకోవడం ద్వారా లేదా ట్రికోడెర్మ విరిడీ ని నీళ్లలో కలిపి మొక్కల కాండం దగ్గర పోయడం ద్వారా తగ్గించుకోవచ్చు అని అన్నారు .ఈ కార్యక్రమంలో ఎఇఓ ముక్తార్ బాషా, వీఏఏలు షర్మిల, అనిల్ కుమార్ రెడ్డి, గ్రామాల సర్పంచ్ లు ఓబులేసు, వెంకట రమణ, ఎంపీటీసీ రషీద్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## అద్భుతం ఆళ్లగడ్డ శిల్ప సంపద తెలంగాణ ఎంపీ డీకే అరుణ



విభారె న్యూస్ అక్టోబర్ 03 ఆళ్లగడ్డ ప్రతినిధి :- ఆళ్లగడ్డ శిల్పకళ అద్భుతమని తెలంగాణ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆమె గురువారం ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ శారద శిల్పకళ మందిరం వద్ద ఉన్న శిల్ప సంపదను తిలకించారు. ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్రాచార్యులు కుమార్తె మహిళా శిల్పి భువనేశ్వరితో కలిసి శిల్పాలను పరిశీలించారు. తనకు కావలసిన విగ్రహం యొక్క కొలతలు ఇంటికి వెళ్ళిన తర్వాత తెలియజేస్తానన్నారని మహిళా శిల్పి భువనేశ్వరి తెలిపారు.

## అహోబిలంలో వైభవంగా ప్రారంభమైన దసరా నవరాత్రులు



విభారె న్యూస్ అక్టోబర్ 03 ఆళ్లగడ్డ ప్రతినిధి :- ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి సన్నిధిలో గురువారం నుండి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో కలశ స్థాపన, విశ్వక్సేనారాధనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవ మూర్తులు శ్ర ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పోలవరం పరుగులే...



ఏలూరు, అక్టోబరు 3, పోలవరం ప్రాజెక్టు పనులు 2026 మార్చికే పూర్తి చేయాలని కేంద్రం షరతు విధించడంతో ఈ ఆర్థిక సంవత్సరంలోనే పనులు, పునరావాసం వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రూ. 30,436,95 కోట్లతో తాజా డీపీఆర్ ను ఆమోదించింది. దీని వల్ల ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తికి రూ. 12,157 కోట్లు అందుబాటులోకి వచ్చాయి. తాజా డీపీఆర్ ఆమోదం తరువాత ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం కృషితో పోలవరానికి అడ్వాన్స్ గా నిధులిచ్చేందుకూ కేంద్రం ముందుకొచ్చింది. ఈ పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టు పునరావాసానికి రూ. 5,500 కోట్లు, ప్రధాన డ్యాం కాలువల్లో నిర్మాణ పనులకు రూ. 1,700 కోట్ల వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో అవసరమని అధికారులు అంచనా వేశారు.ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తులో నీళ్లు నిలబెట్టాలి.. తొలిదశలో ఎనిమిది మండలాల పరిధిలో 172 నివాసాల్లో 38,060 మందికి పునరావాసం కల్పించాలి. ఇప్పటి వరకు 12,797 మందికి పునరావాసం కల్పించారు. ఇంకా 25,263 మందిని పునరావాస కేంద్రాల్లోకి తరలించాల్సి ఉంది. వీరికోసం 16,440 ఎకరాల భూమి సేకరించాలి. దీనికిగాను రూ. 2,435 కోట్లు అవసరం అవుతుంది. మరోకవైపు వీరందరికీ నిర్వాసిత ప్యాకేజీ కోసం రూ. 2,043.59 కోట్లు అవసరం అవుతుంది. అదేవిధంగా పునరావాస కాలనీల నిర్మాణానికి రూ. 3,314 కోట్లు కావాల్సి ఉంది. 2025 జూన్ నాటికి ఎంత వరకు చేయగలరో అంతవరకు చేయాలని కోరుతూ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. తక్షణం 5,500 కోట్లు కావాలంటూ ప్రతిపాదనల్లో పేర్కొన్నారుకొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు నవంబర్ నెలలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఒప్పందాలు పూర్తయ్యాయి. కొత్త డయాఫ్రం వాల్ మట్టి సాంద్రత పెంపు.. ప్రధాన డ్యాం గ్యాప్–2లో పాత డయాఫ్రం వాల్ కు సమాంతరంగా కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం దాదాపు 64వేల చదరపు మీటర్లు పని చేయాల్సి ఉంటుంది. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పనులు 2025 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. ఇందులో భాగంగా నవంబర్ నాటికి డిజైన్లు, ఇతర అంశాలపై చర్చలు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.ప్రధాన డ్యాం మొదటి రెండు గ్యాప్ లలో మట్టి సాంద్రత పెంచే పనులు చేయాల్సి ఉంది. అక్కడ ఇసుకను నింపి వైబ్రో కాంపాక్షన్ ద్వారా అక్కడ మట్టి గట్టిదనం పెంచాల్సి ఉంది. ఇందుకు షెడ్యూలు కూడా పోలవరం అథారిటీకి అధికారులు సమర్పించారు. అనుసంధాన పనుల్లో ఎడమ టన్నెల్ హెడ్ రెగ్యులేటర్, ఎడమ టన్నెల్ లైనింగ్, కుడి టన్నెల్లో మట్టి తవ్వకం లైనింగ్ కూడా 2025 జూన్ నాటికి పూర్తి చేసేలా షెడ్యూల్ వేశారు. ఇంకా తొలిదశలో ఆయకట్టు నీళ్లిచేలా కుడి, ఎడమ కాలువల్లో కూడా పనులు చేయాల్సి ఉంది. ప్రధాన డ్యాం, కాలువల్లో నిర్మాణ పనులకు రూ.1700 కోట్ల వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో అవసరమని అధికారులు అంచనా వేశారు.

# బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ....

తిరుమల, అక్టోబరు 3, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. వైఖానస ఆగమంలో క్రతువుల్లో అంకురార్పణం అత్యంత ముఖ్యమైనది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతం కావాలని కోరుతూ అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముందుగా..శ్రీవారి తరపున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలికలలో పుట్టమన్ను వేసి.. అందులో నవధాన్యాలను నాటుతారు. ఆ నవధాన్యాలకు మొలకలొచ్చేవరకు నీరు పోస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజూ నవధాన్యాలకు నీరు పోస్తారు. అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం అందుకే అంకురార్పణ అయింది. సాయంత్రం సమయంలో అంకురార్పణ నిర్వహించారు. మొలకలు ఎంత బాగా వస్తే అంత ఘనంగా ఉత్సవాలు జరుగుతాయని విశ్వసిస్తారు. అంకురార్పణ ఘట్టం తర్వాత రంగనాయకుల మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు..దీంతో బ్రహ్మోత్సవనాయకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లకు నాంది పలికినట్లు అవుతుంది. అక్టోబర్ 04న బ్రహ్మోత్సవాలకు దేవతలను ఆహ్వానం పలికేందుకు ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ మేరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భ చాప, తాడును టిటిడి అటవీ విభాగం కార్యాలయం నుంచి డిఎఫ్ వో శ్రీనివాసులు, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయం రంగనాయకుల మండపంలో శేషవాహనంపై దర్భతో తయారుచేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 4 శుక్రవారం జరిగే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు.బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభంపైకి గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. ఇందులో భాగంగా వేద పండితులు.. వేద మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. వీటి తయారీ కోసంయు అటవీ శాఖ 10 రోజుల ముందునుంచే కసరత్తు చేస్తుంది. ఈ దర్భలలో రెండు రకాలుంటాయి...ఒకటి శివ దర్భ, మరొకటి విష్ణు దర్భ. శ్రీ వెంకటేశ్వరుడికి విష్ణు దర్భను ఉపయోగిస్తారు. ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామం నుంచి ఈ విష్ణుదర్భను సేకరించారు టిటిడి అటవీ సిబ్బంది. అక్కడి నుంచి దర్భను కోసుకొచ్చి తిరుమలకు తీసుకొచ్చి వారం పాటు ఎండబెట్టి చాప, తాడు సిద్ధం చేశారు. 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో దర్భ చాప, 225 మీటర్ల పొడవైన తాడు తయారు చేశారు. ధ్వజారోహణం తర్వాత అక్టోబరు 4 రాత్రి 9 గంటల నుంచి 11 వరకు పెద్ద శేష వాహన సేవ నిర్వహిస్తారు. అక్టోబరు 12 ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి

# మండలి సభ్యుల రాజీనామాలు ఆమోదం కష్టమే

విజయవాడ, అక్టోబరు 3, ఎమ్మెల్సీ రాజీనామా వ్యవహారంలో వైసీపీ వ్యూహం ఏంటి? నాన్చుడు ధోరణితో వ్యవహరించాలని చూస్తుందా? శాసనమండలి చైర్మన్ ద్వారా ఆధిపత్యం ప్రదర్శించాలని భావిస్తోందా? ఎట్టి పరిస్థితుల్లో శాసనమండలిలో టిడిపి కూటమి బలం పెరగకూడదని చూస్తోందా? పొలిటికల్ సర్కిల్లో ఇదే ఆసక్తికర చర్చ నడుస్తోంది. వైసీపీకి చెందిన పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. వైసీపీకి సైతం గుడ్ బై చెప్పారు. ఎప్పుడో ఆగస్టులో తమ పదవులకు రాజీనామా చేస్తే ఇప్పటివరకు అవి ఆమోదం పొందలేదు. అందులో ఇద్దరు స్వయంగా మండలి చైర్మన్ మోసేన్ రాజుకు తమ రాజీనామా పత్రాలు సమర్పించారు. వ్యక్తిగత సమస్యలతోనే తాము పదవులకు రాజీనామా చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కానీ ఎంతవరకు మండలి చైర్మన్ వాటిని ఆమోదించలేదు. అయితే ఉద్దేశపూర్వకంగానే ఇలా జాప్యం జరుగుతుందన్న అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పద్మశ్రీ సోమవారం మరోసారి మండలి చైర్మన్ మోసేన్ రాజును కలిశారు. తన రాజీనామాను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. లేఖ కూడా రాశారు. అయినా సరే ఆమోదానికి నోచుకోలేదు. విశేషమేమిటంటే అదే వైసీపీకి ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేశారు. తమ రాజీనామాను రాజ్యసభ చైర్మన్ కు అందించారు. వెనువెంటనే ఈ రాజీనామాలు ఆమోదించారు రాజ్యసభ చైర్మన్. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం భిన్నంగా జరుగుతుండడం విశేషం. కేవలం వైసీపీకి చెందిన మండలి చైర్మన్ ఉండడం వల్లే ఇలా జాప్యం చేయగలుగుతున్నారన్న టాక్ నడుస్తోంది.ఏపీలో కూటమి భారీ మెజారిటీతో గెలిచింది. వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. 175 అసెంబ్లీ సీట్లకు గాను కూటమికి ఏకంగా 164 సీట్లు దక్కాయి. అటు పార్లమెంట్ స్థానాలను సైతం దాదాపు స్వీప్ చేసినంత పని చేసింది కూటమి. 25 సీట్లకు గాను 21చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచి సత్తా చాటారు. వై నాట్ 175 అన్న నినాదంతో బరిలో దిగిన వైసీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఆ పార్టీకి మైండ్ బ్లాక్ అవుతోంది. మరోవైపు ఎన్నికల అనంతరం వైసిపి నుంచి కీలక నేతలు బయటకు వస్తున్నారు. వీరిలో ఇంకా పదవీకాలం ఉన్న రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు ఉండడం విశేషం. అయితే ఇప్పుడు ఎమ్మెల్సీల రాజీనామాలు ఆమోదానికి నోచుకోకపోవడం హాట్ టాపిక్ అవుతోంది.శాసనమండలిలో వైసీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఆ పార్టీకి 38 మంది ఎమ్మెల్సీల బలం ఉంది.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి గెలిచినంత మాత్రాన వైసీపీకి పోయిందేమీ లేదని చెప్పుకొచ్చారు. శాసనమండలిలో 38 మంది, రాజ్యసభలో 11 మంది, శాసనసభలో 11 మంది, లోక్సభలో నలుగురు.. ఇలా కలుపుకొని వెళ్తే వైసీపీకి సైతం భారీగా ప్రజా ప్రతినిధులు ఉన్నారని.. ముఖ్యంగా శాసనమండలి ద్వారా టిడిపి కూటమి ప్రభుత్వాన్ని కట్టడి చేద్దామని ఎమ్మెల్సీలకు పిలుపు ఇచ్చారు. అయితే జగన్ నుంచి ఈ తరహా హెచ్చరిక రావడంతో టీడీపీ ప్రభుత్వం పాలు కదపడం ప్రారంభించింది. నేరుగా ఎమ్మెల్సీలను చేర్చుకోవడం కంటే.. వారితో రాజీనామా చేయించి.. ఖాళీ అయిన సీట్లను టిడిపి కూటమితో భర్తీ చేయాలన్నది ప్లాన్. అందులో భాగంగానే ముగ్గురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. కానీ ఆ రాజీనామాలను ఆమోదించకుండా శాసనమండలి చైర్మన్ మోసేన్ రాజు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎమ్మెల్సీలను గెలుచుకోవడం వైసీపీకి జరగని పని. ఎందుకంటే ఆ పార్టీకి ఉన్న బలం కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. కూటమికి 164 సీట్లు ఉన్నాయి. వైసీపీ సభ్యుల రాజీనామాతో కూటమి ఈజీగా ఆ స్థానాలను గెలిచే ఛాన్స్ ఉంది. అందుకే కూటమి వ్యూహాత్మకంగా వైసీపీ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని చూస్తోంది. అయితే ఇలా చేస్తున్న రాజీనామాలను వైసీపీ అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందుకు మండలి చైర్మన్ మోసేన్ రాజును వాడుకుంటుంది. ఇలాగే ఆయన వ్యవహార శైలి నడిస్తే ప్రభుత్వం న్యాయ పోరాటం చేసి తగిన బుద్ధి చెప్పాలని చూస్తోంది. మొత్తానికైతే వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.

# దూరమైన సొంత సామాజిక వర్గం...

కర్నూలు, అక్టోబరు 3, న్నికల్లో జగన్ రెడ్డి సామాజిక వర్గం ఆదరించలేదా? అభిమానం ఉన్న జనాలతో ఓట్లు వేయించ లేదా? ఇంతటి ఓటమికి రెడ్డి సామాజిక వర్గమే కారణమా? అంటే అవుననే సమాధానం వస్తోంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి లాంటివారు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అన్నాక గెలుపు ఓటములు సహజం. కానీ రెడ్డి సామాజిక వర్గం సుదీర్ఘకాలం కాంగ్రెస్ వెంట నడిచింది. రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి సోషల్ ఇంజనీరింగ్ కు ప్రాధాన్యమిచ్చింది. బీసీ, ఎస్సీ, ఎస్టి, మైనారిటీలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. అదే సమయంలో వైసీపీ ఉన్నతికి కృషి చేసిన రెడ్డి సామాజిక వర్గాన్ని మాత్రం పెద్దగా పట్టించుకోలేదు. చివరకు వారు ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే, ఎంపీపీ, జడ్పిటిసి, చివరకు సర్పంచ్ పదవుల్లో సైతం వేరే సామాజిక వర్గాల వారికి కూర్చోబెట్టింది. అది అంతిమంగా రెడ్డి సామాజిక వర్గంలో ఆగ్రహానికి కారణమైంది. తమ వరకు ఓకే కానీ.. కేదార్ తో కానీ.. ప్రజలతో కానీ ఓటు వేయించేందుకు ఆ సామాజిక వర్గం నేతలు ఇష్ట పెట్టుకోలేదు. దాని ఫలితమే వైసీపీకి ఘోర పరాజయం.ఈ ఎన్నికల్లో 90 శాతం కమ్మ సామాజిక వర్గం టిడిపికి మద్దతు తెలిపింది. మద్దతు తెలపడమే కాదు స్వయంగా రంగంలోకి దిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్మలు రంగంలోకి దిగి ఎలక్షన్ క్యాంపెయిన్ చేశారు. భారీగా నిధులు సమకూర్చారు. ఈసారి కానీ టిడిపి రాకుంటే కమ్మ సామాజిక వర్గం ఉనికి ప్రశ్నార్థకం అవుతుందని భయపడ్డారు. అందుకే తామే అభ్యర్థుల మన్న రీతిలో రంగంలోకి దిగారు. సామాజిక వర్గ పరంగా విభేదాలు ఉన్న కాపు సామాజిక వర్గాన్ని కలుపుకొని వెళ్లారు. కానీ ఆ స్థాయిలో రెడ్డి సామాజిక వర్గం పని చేయలేదు. 2019లో అదే పని చేసిన రెడ్డి సామాజిక వర్గానికి ఐదేళ్లపాటు ఎటువంటి న్యాయం చేయలేదు జగన్.సాధారణంగా రెడ్డి సామాజిక వర్గంలో నేతలు అధికం. ముఖ్యంగా రాయలసీమలో దశాబ్దాల పాటు రాజకీయ పునాది వేసుకున్నాయి కొన్ని కుటుంబాలు. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక సోషల్ ఇంజనీరింగ్ పేరిట పెద్ద ఎత్తున బీసీలకు పదవులు ఇచ్చారు. ఎస్సీ ఎస్టీలకు సైతం అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అదే సమయంలో రిజర్వేషన్ల పేరిట రెడ్డిల ప్రాధాన్యత తగ్గించారు. దీంతో ఆ సామాజిక వర్గంలో నాయకత్వం తగ్గింది. నాయకత్వ పటిమను క్రమేపి తగ్గించేశారు. వైసీపీని గెలిపించేందుకు అహోరాత్రులు శ్రమించిన తమ విషయంలో.. జగన్ అలా ప్రవర్తించేసరికి రెడ్డి సామాజిక వర్గంలో ఒక రకమైన నిర్లిప్తత ప్రారంభమైంది. తమకు తాము వైసీపీ మద్దతు దారులుగా నిలిచినా.. క్యాడర్ తో పాటు ప్రజలను ఒప్పించేందుకు వారి మనసు అంగీకరించలేదు. అందుకే ఈ ఎన్నికల్లో రెడ్డి ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో సైతం వైసీపీకి వచ్చిన ఓట్లు అత్యల్పం.తాజాగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి నాయకుడిగా 20 సంవత్సరాల శ్రమ ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాంటి నాయకుడికి సోషల్ ఇంజనీరింగ్ పేరుతో తప్పించి.. వేరే వారికి అప్పగిస్తే కచ్చితంగా బాధ కలుగుతుంది. అదే పెయిన్ రెడ్డి సామాజిక వర్గం నేతలు ఎదుర్కొన్నట్లు కేతిరెడ్డి చెప్పుకొచ్చారు. రాజకీయ ప్రాబల్యం కోల్పోయిన వారి పరిస్థితి దిగజారుతుందని.. ఆ పరిస్థితికి జగన్ ఆలోచనలే కారణం అన్నట్టు తప్పు పట్టారు కేతిరెడ్డి. మొత్తానికైతే జగన్ వైఫల్యాన్ని ఇప్పుడు రెడ్డి సామాజిక వర్గం ఎత్తిచూపుతుండడం విశేషం. దీని నుంచి అయినా జగన్ గుణపాఠాలు నేర్చుకుంటారో? లేదో? చూడాలి.

# భార్య ను గొడ్డలితో నరికి చంపిన భర్త

నంద్యాల అక్టోబరు 3,నంద్యాల జిల్లాలో దారుణం జరిగింది. కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు. తన భార్యను అత్యంత పాశవికంగా హతమార్చాడు ఓ భర్త. కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీపార్వతి (38), రామ్మోహన్ దంపతులు. వీరికి పెళ్లి జరిగి 19 సంవత్సరాలు అయింది ఇద్దరు పిల్లలు. త్రాగుడుకు బానిసగా మారి రామ్మోహన్, ప్రతి నిత్యం పుటుగా మద్యం సేవించి, ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులందరితో తరచుగా గొడవ దిగుతున్నాడు. చివరికి గత కొంతకాలంగా పార్వతి తల్లిదండ్రులతో కలిసి కనకాద్రి పల్లెలోనే ఉండింది. అయితే గత రాత్రి పూటుగా మద్యం సేవించిన కిరాతకుడు రామ్మోహన్ ఇంటికి వచ్చి భార్య లక్ష్మీపార్వతితో డబ్బులు విషయంలో ఘర్షణ పడ్డాడు. దీంతో మరింత ఆవేశానికి లోనైన రామ్మోహన్, రాత్రి నిద్రిస్తున్న భార్యను గొడ్డలితో తల భాగంపై విచక్షణా రహితంగా నరికి దారుణ హత్య చేశాడు. ఘటన స్థలంలోనే ఆమె మృతి చెందింది. అనంతరం భర్త అక్కడి నుంచి జారుకున్నాడు. మహిళ హత్య సమాచారం తెలుసుకున్న కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న రామ్మోహన్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# పరిశ్రమల్లో పరిశుభ్రత పాటించాలి.

**ఆర్ జి త్రీ జి ఎం సుధాకర్ రావు**

**కమాన్ పూర్,పరిశ్రమల్లో పరిశుభ్రత పాటించాలని సుధాకర్ రావు అన్నారు.**

**ఆర్జిఓసీఎం I, ఆర్జి3 ఏరియా**

భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు బొగ్గు పరిశ్రమలలో పరిశుభ్రత పాటించాలనే తలంపుతో స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించడం జరుగుతుంది. సింగరేణి సంస్థ వ్యాప్తంగా కూడా ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 2వ తేదీ నుండి ప్రారంభించుకొవడం జరిగింది. అందులో భాగంగా గురువారం ఓసీ1 బేస్ వర్క్ షాప్ నందు స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ రావు ముఖ్య అతిధిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఓసీ1 బేస్ వర్క్ షాప్ లో మొక్కలు నాటారు అనంతరం పరిసరాలను పరిశుభ్రపరిచారు.ఓసీ 1 ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్. రాధా కృష్ణ మాట్లాడుతూ... ఈ 15 రోజులే కాకుండా ప్రతి రోజు కూడా పరిశుభ్రతను విధిగా ఆచరించాలని తమ ఇంటిలో, ఆఫీసులో ఈ స్వచ్ఛ్ కార్యక్రమాన్ని చేపట్టి ఆరోగ్యకరమైయన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు మాట్లాడుతూ... మహాత్మా గాంధీ స్వాంతంత్ర్యం కంటే పరిశుభ్రత ముఖ్యం అనేవారు అని గుర్తు చేశారు. దీనిని అనుసరించి మన భారత ప్రభుత్వము స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని 30 రోజుల పాటు నిర్వహిస్తుందని అన్నారు. దీని ద్వారా బొగ్గు పరిశ్రమలలో అవగాహన తీసుకువచ్చి పరిశుభ్రమైన పని స్థలాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రమైన పరిసరాలు నిర్మించుకుంటే అవే అభివృద్ధికి పునాదులౌతాయని ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ తమ పరిధిలో శుభ్రత పాటిస్తూ, పరిసరాలను కూడా శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని హితవు పలికారు. స్వచ్ఛతా అనేది మన జీవన విధానంగా మారాలని అన్నారు.

# వర్మ...త్యాగయ్యగా మిగిలిపోవాల్సిందేనా

కాకినాడ, అక్టోబరు 3, ఎన్నికల్లో త్యాగం చేశారు వర్మ. జనసేన అధినేత పవన్ కోసం తన పిఠాపురం నియోజకవర్గాన్ని వదులుకున్నారు. టిడిపి తో జనసేన పొత్తు కుదరడం, పవన్ పిఠాపురం నియోజకవర్గాన్ని కోరుకోవడం చకచకా జరిగిపోయాయి. తొలుత పిఠాపురం నియోజకవర్గాన్ని వదులుకునేందుకు వర్మ తట పటాయించారు. కానీ చంద్రబాబు చెప్పేసరికి కాదనలేకపోయారు.రాష్ట్రంలోఖాళీ అయ్యే తొలి ఎమ్మెల్సీ స్థానాన్ని వర్మతో భర్తీ చేస్తారని అప్పట్లో ప్రచారం చేశారు. ఉన్న ఒక్క మంత్రి పదవి కూడా ఆయన కోసం ఖాళీగా ఉంచినట్లు చెప్పుకొచ్చారు.కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటుతోంది. నామినేటెడ్ పోస్టుల భర్తీ జరిగింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఖాళీలు అయ్యాయి. అదే సమయంలో రాజ్యసభ పదవులకు సైతం కసరత్తు జరుగుతోంది.కానీ ఎక్కడ వర్మ పేరు ప్రస్తావనకు రావడం లేదు. దీంతో వర్మ అనుచరుల్లో ఒక రకమైన బాధ కనిపిస్తోంది. మరోవైపు పిఠాపురం నియోజకవర్గాన్ని తనకు శాశ్వతంగా ఉంచుకోవాలని పవన్ భావిస్తున్నారు. అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. మెగా కుటుంబానికి చెందిన వారికి సైతం పిఠాపురం పై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇక పిఠాపురం పై వర్మ ఆశలు వదులుకోవాల్సిందే.అయితే ఇంత త్యాగానికి గుర్తింపు లేకుండా పోవడంతో వర్మ సైతం లో లోపల బాధపడుతున్నట్లు తెలుస్తోంది. అటు నియోజకవర్గంలో సైతం జన సైనికులు వర్మను పట్టించుకోవడం మానేయడంతో.. ఆయన అనుచరులు సైతం తెగ బాధపడిపోతున్నట్లు తెలుస్తోంది.పిఠాపురం నియోజకవర్గంలో వర్మకు పట్టు ఎక్కువ.2014 ఎన్నికల్లో టిడిపి టికెట్ దక్కకపోయేసరికి ఇండిపెండెంట్ గా పోటీ చేశారు. తన శక్తి యుక్తులతో గెలిచారు కూడా. తరువాత టిడిపిలో చేరారు. 2019 ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో ఓడారు. 2024 ఎన్నికల్లో పోటీకి అన్ని రకాలుగా సన్నాహాలు చేస్తున్నారు. ఇంతలో పవన్ ఎంటర్ కావడంతో పక్కకు తప్పుకున్నారు వర్మ. కానీ ఆయన త్యాగానికి ఇంతవరకు ఫలితం దక్కలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపనే తప్ప వర్మకు పదవి కేటాయించలేదు. తాజాగా గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ రానుంది. ఇది ఈజీగా గెలిచే స్థానం. కానీ వర్మ పేరు పరిగణలోకి తీసుకోకపోవడం విశేషం.ఎన్నికల్లో 70 వేల మెజారిటీతో గెలిచారు పవన్. ఆయనను ఎలాగైనా ఓడిస్తామని వైసిపి నేతలు ప్రతిన బూనారు. కానీ వర్మ పట్టుబట్టారు. తన శక్తి యుక్తులను ప్రదర్శించారు. రికార్డు స్థాయి మెజారిటీ వచ్చేలా వ్యూహం పన్నారు. అటు పవన్ సైతం వర్మ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయన గౌరవానికి తగ్గట్టు నడుచుకుంటామని హామీ ఇచ్చారు. అయితే రాజకీయంగా అనుకున్న స్థాయిలో వర్మకు గౌరవం దక్కడం లేదు. జనసైనికులు పెద్దగా విలువ ఇవ్వడం లేదు. దీంతో వర్మ అనుచరులు బాధపడుతున్నారు.ఇటీవల చంద్రబాబు నామినేటెడ్ పదవులను ప్రకటించారు. దాదాపు 20 కార్పొరేషన్లకు సంబంధించిన నియామకాలు చేశారు. కానీ వర్మ పేరును పరిగణలోకి తీసుకోలేదు. ఎమ్మెల్సీవిషయంలో సైతం స్పష్టత ఇవ్వడం లేదు. వైసీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు పదవులకు రాజీనామా చేశారు. వారి స్థానంలోనైనా వర్మ కు ఛాన్స్ ఇస్తానన్న క్లారిటీ ఇవ్వడం లేదు. దీంతో వర్మలో ఒక రకమైన బాధ కనిపిస్తోంది. మరి ఇంత అన్యాయమా అని ఆయన ఆవేదనలో ఉన్నట్లు తెలుస్తోంది.

# తలుపులమ్మ తల్లికి యనమల పూజలు

తుని,ప్రముఖ పుణ్యక్షేత్రం కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కొలిచే శ్రీ తలుపులమ్మ తల్లి అమ్మవారు లోవ దేవస్థానంలో శరన్నవరాత్రులు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ తలుపులమ్మ లావ దేవస్థానాన్ని టూరిజం గా మరియు అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తరపున అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే పార్కింగ్ ఇబ్బందిగా ఉందని తన దృష్టికి వచ్చిందని చుట్టుపక్కల రైతులతో మాట్లాడి పార్కింగ్ మెరుగుపరిచే విధంగా కృషి చేస్తానన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకూడదని ఆదేశించారు.

# వైభవంగా నవరాత్రులు ప్రారంభం

కాకినాడ,కాకినాడ జిల్లా వ్యాప్తంగా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆయా ఆలయాలలో అమ్మవారికి అవతరాలు చేశారు. పదవ శక్తిపీఠం, శివుడు కోడి రూపంలో వెలిసిన పాదగయ క్షేత్రం పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా కనిపించారు .కాకినాడ దేవాలయం వీధి శివాలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. శ్రీపీఠంలో పరిపూర్ణానంద సరస్వతి మహా శక్తి యాగాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాకు ఆధ్యాత్మిక శోభ వచ్చింది.

# చదువుకు పేదరికం అడ్డుకారాదు...

విభారె న్యూస్ ఎమ్మిగనూరు అక్టోబర్ 3.చదువుకు పేదరికం అడ్డు కారాదని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో దృఢ సంకల్పంతో ప్రతి ఒక్కరూ విద్య వైద్య రంగాలలో ముందుకు రాణించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) రాష్ట్ర కార్యదర్శి డా.మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు,ఎమ్మిగనూరు మండల విద్యాధికారి ఎం. ఆంజనేయులు,టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న లు పేర్కొన్నారు. గురువారం గాంధీనగర్ లో మల్లెల ఆల్ ఫ్రె డ్ రాజు తన స్వగృహంలో 2024 – నీట్ ఎంట్రెన్స్ పరీక్షల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించిన పేద దళిత విద్యార్థులైన గోనెగండ్ల మండలం లోని అల్వాల గ్రామానికి చెందిన మల్లెపోగు అద్భుత్ కుమార్, నందవరం మండలం లోని నాగలదిన్నె గ్రామానికి చెందిన మంచాల సునీల్ కుమార్ లను శాలువాలు కప్పి సత్కరించి అభినందించారు.5 సంవత్సరముల డాక్టర్ కోర్స్ కు ఏటా 10 వేలు చొప్పున చెరో 50 వేలు ఆర్థిక సాయం ప్రకటించి మొదటి సంవత్సరానికి గాను ఇద్దరికీ 10,000 చొప్పున తన సతీమణి మల్లెల సునీలఫ్రెడ్ రాజు ఆయన తనయుడు డాక్టర్ మల్లెల మహిత్ వారి చేతుల మీదుగా

**పేద దళిత వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం..**



పేద వైద్య విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించిన మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు..

అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అలాగే దళిత,బహుజన వ్యాసకర్త, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకములను విద్యార్థులకు అందజేసి అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థుల అభినందన కార్యక్రమంలో. అల్వాల గ్రామానికి చెందిన యువకులు శిఖామణి, కిరణ్ కుమార్ లు నాయకులను, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబాలలో జన్మించిన అద్భుత్ కుమార్,సునీల్ కుమార్ లు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో చదువుతూ కార్పొరేట్ స్కూల్ లతో పోటీపడి డాక్టర్ సీట్లు సాధించడం గొప్ప విషయమ న్నారు. ఈ పేద దళిత వైద్య విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆర్థిక సాయం అందించేందుకు మానవత్వంతో దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ రోజా ఆర్ట్స్ ఉసేని, ఉపాధ్యాయులు రంగన్న,మల్లెల గ్రూప్ సభ్యులు జడ రవి,ముత్తు, న్యూ లైఫ్ సామేలు,అజిత్,సతీష్,హనుమంతు, గంగా, యు.ఎస్.ఎఫ్. ఐ. ఉదయ్,అనిల్, భవిత వికలాంగుల పాఠశాల ఉపాధ్యాయులు పార్లపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాల త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చిన సుంకులమ్మ..



విభారె న్యూస్ అక్టోబర్ 03ఎమ్మిగనూరు.దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా మొదటిరోజు అయిన గురువారం రోజు స్థానిక శ్రీ సుంకులమ్మ దేవాలయంలో బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సుంకులమ్మ ఆలయంలో ప్రాతః కాలం నుండే విశేష పూజలు, అభిషేకం తదితర పూజలుఅన్నియుఆలయపూజారి నాగరాజు దంపతులు చే పూజలు గావించడం జరిగినది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణగావించడం జరిగినది. అలంకారం గావించిన వారు కార్తీక,ఉష,సుగుణతదితరులుచే అలంకరణ గావించారు.

## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత...



విభారె న్యూస్ అక్టోబర్ 03 ఆళ్ళగడ్డ ప్రతినిధి :- వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు రాణమ్మ , ఎఫ్ఎస్ఓ మహబూబ్ ఖాన్ అన్నారు. గురువారం 70 వ వన్య ప్రాణివారోత్సవాల సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ అనురాగ్ మీనా, ఐఎఫ్ఎస్,ఆదేశాల మేరకు, సబ్ డి ఎఫ్ ఓ శ్రీనివాస్ రెడ్డి , సూచనలమేరకు రేంజ్ ఆఫీసర్ బి. శ్రీపతి నాయుడు పర్యవేక్షణ లో తువ్వపల్లి గ్రామం లోని అంగన్వాడీ లో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా వన్య ప్రాణుల వేట వంటి నేర ప్రవృత్తులు విడనాడి వన్య ప్రాణుల సంరక్షణ లో భాగస్వాములు అవ్వాలని ,అటవీ ప్రాంతంలో రోడ్డుపై ఆహార పదార్థాలను అడవి జంతువులకు వేయవద్దు అని, వాహన వేగాన్ని తగ్గించి రోడ్డు ప్రమాదాల ను నివారించాలని, రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దు వెంబడి వన్య ప్రాణుల అవసరాలను గుర్తించి మానవ కార్యకలాపాలను తగ్గించి అడవి జంతువులు మానవుల యొక్క సంఘర్షణను తగ్గించాలని, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ సురేంద్ర గౌడు, డి ఈ ఓ శంకర్, డిపోమేస్రి నరసింహ మరియు అంగన్వాడీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

# ఘనంగా ప్రారంభమైన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు






విభారె న్యూస్ అక్టోబర్ 03 ఆళ్ళగడ్డ ప్రతినిధి :- పట్టణంలోని కాళికామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ శిల్పి దురగడ్డ రవీంద్ర ఆచారి. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర ఆచారి అమ్మవారిని కలశంలోకి ఆవాహన చేసి కలశ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున, సుజాత దంపతులు, బ్రహ్మయ్యాచారి ఉమాదేవి దంపతులు, మరియు శివకుమార్ ఆచారి ధర్మపత్ని శివ నాగ లలిత ఉభయ దాతలుగా వ్యవహరించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భక్తులకు కాళికామాతగా దర్శనమిచ్చారు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం మహిళా కమిటీ అధ్యక్షురాలు దురగడ్డ అనురాధ ఆధ్వర్యంలో లలిత సహస్రనామ పారాయణము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళికామాత ఆలయ కమిటీ సభ్యులు. యువజన సంఘం సభ్యులు మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బైక్ దొంగలు అరెస్టు :ఇస్మాయిల్ సీఐ టుటౌన్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 03- పట్టణంలో మోటర్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేశామని టుటౌన్ సీఐ ఎస్. ఇస్మాయిల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల 2 టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన మోటార్ సైకిల్ల దొంగతనం కేసులలో నంద్యాల జిల్లా ఎస్పీ. ఆధిరాజ్ సింగ్ రాణా గారి పర్యవేక్షణలో రాబడిన సమాచారం మేరకు, ఎన్. యుగంధర్ బాబు, డి.ఎస్.పి. ఆధ్వర్యములో నంద్యాల 2 టౌన్ పోలీసు స్టేషన్ సి.ఐ. ఎస్ ఇస్మాయిల్ నాయకత్వములో నంద్యాల 2 టౌన్ పోలీసు స్టేషన్ ఎస్.ఐ. బి. సురేశ్ గురువారం హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, ఇమ్మానియె?లూ, కానిస్టేబుళ్లు శివ కుమార్ మరియు సురేశ్ రెడ్డి సహకారముతో మోటార్ సైకిళ్ళను దొంగిలించిన నేరస్తులను అదుపులోనికి తీసుకొన్నామని తెలిపారు . వారిని విచారించగా నంద్యాల టౌన్ లో వివిధ ప్రాంతాలలో రాత్రి సమయములలో దొంగిలించిన 5 మోటార్ సైకిల్లను వారివద్ద నుండి రికవరీ చేసి వారిని రిమాండుకు తరలించడం జరిగిందన్నారు .మోటార్ సైకిల్ల రికవరిలో ప్రతిభ కనబరచిన సిబ్బందిని డి.ఎస్.పి. ఎన్. యుగంధర్ బాబు అభినందించారు . ప్రతిభ కనబరచిన సిబ్బందికి నగదు రివార్డు ఇచ్చారు . నంద్యాల ప్రజలు తమ మోటార్ సైకిళ్ళను తాళము వేసి జాగ్రత్తగా ఇంటివద్ద ఉంచుకొవాలని,రికార్డులు లేని వాహనాలు కొనవద్దని తెలియజేశారు . విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా నంద్యాల పట్టణములో పోలీసు అధికారులు వాహన తనిఖీలు చేస్తుండగా చాలావరకు రికార్డు లేని వాహనాలకు జరిమాన లేదా సీజ్ చేయడం జరుగుతుంది.కావున ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు

## మహానంది దేవస్థానం అభివృద్ధే కూటమి లక్ష్యం:బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 03- మహానందీశ్వర దేవస్థానం అభివృద్ధి చేయడమే కూటమి లక్ష్యం అని శ్రీశైల ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహానందీశ్వర స్వామి వారి దేవస్థానము నందు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అభివృద్ధి లో భాగంగా నూతన నవరాత్రి యాగశాల ప్రారంభం. మరియు నూతన నిచ్చితార్థ మండపం నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహనాది అధికారి నల్లకాలువ శ్రీనివాస రెడ్డి మరియు దేవస్థాన సిబ్బంది వేద పండితులు అర్చకులు దాతలు తదితరులు పాల్గొన్నారు.

## 38 మంది హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్ చెక్కులు అందజేత.. - జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్.



విభారె న్యూస్ అక్టోబర్ 03 కర్నూలు జిల్లా ప్రతినిధి..ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందించిన జిల్లా ఎస్పీ.కర్నూలు జిల్లాలోని హోంగార్డు కుటుంబాలలోని విద్యార్థినీ విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలవాలని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ గురువారం తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ప్రతిభ కనబరిచిన 38 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ చెక్కులను జిల్లా ఎస్పీ అందజేశారు. ఇందులో రూ.1,000 నుండి రూ.2,000 ల ప్రకారం ప్రోత్సాహకరంగా జిల్లా హోంగార్డ్స్ వెల్ఫేర్ ఫండ్ నుండి మెరిట్ స్కాలర్ షిప్ చెక్కులు అందజేశారు.అనంతరం కాంట్రిబ్యూషన్ ఫండ్ చెక్కులు ఇద్దరికి అందజేశారు. ఇందులో ఒక్కొక్కరికి రూ.2 లక్షలు అందజేశారు.మ్యారేజ్ గ్రాంట్ చెక్కులు 4 గురికి అందజేశారు.ఇందులో ఒక్కొక్కరి రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ...టెన్త్ ,ఇంటర్ ,డిగ్రీ , మెడిసిన్, పిజి,డిప్లమా, బి.టెక్ మొదలగు కోర్సులలో ప్రతిభ కనబరచిన వారికి మెరిట్ స్కాలర్ షిప్ లను ఇవ్వడం జరిగిందన్నారు. హోంగార్డుల కుటుంబాలలోని పిల్లలు బాగా చదివి అందరికీ ఆదర్శంగా ఉండాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యాక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్,హోంగార్డు డిఎస్పీ ఎస్. క్రిష్ణమోహన్, హోంగార్డు ఆర్ ఐ జావేద్ పాల్గొన్నారు.

## ఈనెల 5 వ తేది నుండి వచ్చేనెల 6 వ తేదీ వరకు విద్యార్థి బస్ పాసులు ఇవ్వబడవు..

విభారె న్యూస్ అక్టోబర్ 03 కర్నూలు జిల్లా ప్రతినిధి. ..ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం (ఏపీఎస్ఆర్టీసీ) నందు బస్సు పాసు సాఫ్ట్ వేర్ ను పాత సాఫ్ట్ వేర్ నుండి కొత్త సాఫ్ట్ వేర్ కి మార్చుతున్న కారణంగా 05.10.2024, 06.10.2024 వ తేదీలలో విద్యార్థి బస్సు పాసులు ఇవ్వబడవు.కావున విద్యార్థులు దీనిని గమనించి పై రెండు తేదిలలో బస్సు పాసుల కొరకు డిపో వద్దకు రావద్దని మనవి. 07.10.2024 నుండి బస్సు పాస్ కౌంటర్లు లో బస్సు పాసులు యధావిధిగా ఇవ్వబడును

## బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు..



విభారె న్యూస్ అక్టోబర్ 03 ఎమ్మిగనూరు..దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటిరోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులయి దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ అలంకరణ చేపట్టిన వారు మిట్టె పరమేష్, శేఖర్,యశ్వంత్,సునీల్, శశి తదితరులు పాల్గొని అలంకరణ గావించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**